# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రకాశం జిల్లా మార్కాపురంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పాల్గొననున్నారు.**
2. **విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపడుతున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాసన మండలిలో తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు పెట్టేందుకు అనువైన రాష్ట్రమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**
4. **బెల్టు దుకాణాలపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శాసన మండలిలో స్పష్టం చేశారు.**
5. **రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా మూడవ శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.**

==========================

ప్రకాశం జిల్లా మార్కాపురంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పాల్గొననున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఈ సందర్భంగా పర్యటన ఏర్పాట్లను ఆయన నిన్న అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 22 సెకన్లు

--------------------------

విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపడుతున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఆధార్ తరహాలో విద్యార్థుల కోసం అపార్ ఐడీని ప్రవేశపెడుతున్నామన్నారు. తద్వారా విద్యార్థుల విద్యాసంబంధిత అంశాలపై సమగ్ర అంశాలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలియజేస్తూ..

..వాయిస్..31 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు పెట్టేందుకు అనువైన రాష్ట్రమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. జర్మనీ పర్యటనలో ఉన్న ఆయన నిన్న ఐటీబీ బెర్లిన్–2025 సదస్సులో విదేశీ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని, ఆకర్షణీయమైన కొత్త విధానాల ద్వారా పెట్టుబడుదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తోందని మంత్రి తెలిపారు.

---------------------------

బెల్టు దుకాణాలపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా బెల్టు దుకాణాలపై శాసనమండలిలో ఈరోజు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో నాసిరకమైన మద్యం అమ్మకాలను నిలిపివేశామన్నారు. రాష్ట్రాన్ని సారా రహితంగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .23.. సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా మూడవ శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ విధిగా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అమరావతి సచివాలయం నుంచి నిన్న ఆయన వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతపై గత రెండు నెలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఈ నెల 15వ తేదీన చేపట్టే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఆ వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. "గత ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణను అస్తవ్యస్తంగా చేపట్టిందన్నారు. ఈ అంశంపై మంత్రి వర్గంలోనూ చర్చించలేదని చెప్పారు. ఎమ్మిగనూరు, ఉదయగిరి రెవెన్యూ డివిజన్లుగా మార్చాలని ప్రతిపాదనలున్నాయని అద్దంకి, మడకశిర రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో స్వయం ఉపాధి రాయితీ రుణాలకు అర్హులైన బీసీ వర్గాల వారు ఈ నెల 10 వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి ముగిసిన నేపథ్యంలో ఉత్తరాంధ్ర, ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఆమె నిన్న ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. బాపట్లలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన నిన్న కలెక్టర్ , ఇతర

అధికారులతో కలిసి జిల్లా పర్యాటకాభివృద్ధి పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మాట్లాడూతూ, అనేక వైవిద్యాలు ఉన్న బాపట్ల జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.పర్యాటక రంగంలో పెట్టుబడుల పెట్టడం ద్వారా రాష్ట్ర ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయవచ్చని తెలియజేస్తూ,

వాయిస్ ..25.. సెకన్లు

-----------------------------

పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రేపు జిల్లాలో అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అదనపు న్యాయమూర్తి సికిందర్ భాషా ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. రాజీమార్గమే రాజమార్గమనే నినాదంతో కక్షిదారుల అంగీకారంతో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

-----------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల తెప్పోత్సవాలు ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం-టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 13వ తేదీ వరకు ఈ తెప్పోత్సవాలు కొనసాగుతాయి. ఇందుకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల మధ్య పుష్కరిణిలో తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మలయప్పస్వామి వారు , అమ్మవారు వివిధ అలంకరణలలో భక్తులకు తెప్పలపై ఊరేగుతూ దర్శనం ఇవ్వనున్నారు.

-----------------------------

మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2025 కార్యక్రమాల్లో భాగంగా ఏలూరులో 2 కె మారథాన్‌ను జిల్లా కలెక్టర్ ఈ ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి పాత బస్టాండ్ వరకు ఈ 2 కె మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, మహిళలు,బాలికలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రీసెల్వి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మహిళల హక్కులు,సమానత్వం,సాధికారాతపై సమాజాన్ని చైతన్య పరిచేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

======================